# పథకాలను మెచ్చే పార్టీకి ఆదరణ


బీఆర్ఎస్‌లో చేరిన నేతలకు గులాబీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్
- బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్, బీజేపీ నాయకులు

జగిత్యాల రూరల్, అక్టోబర్ 8: ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను మెచ్చే బీఆర్ఎస్‌కు ఆదరణ లభిస్తున్నదని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. సీఎం కేసీఆర్ తొమ్మిదేండ్ల పాలనలో అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారని కొనియాడారు. జగిత్యాలలో 10 వ వార్డు లింగంపేట్, రాయికల్ మండలంలోని బోర్నపల్లి, చింతలూరు గ్రామాలకు చెందిన 150 మంది కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ గొల్లపల్లి రోడ్డులో ఎస్సీ గురుకుల డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయాభివృద్ధికి విరివిగా నిధులు వెచ్చిస్తున్నదన్నారు. అన్ని వర్గాలకు మేలు చేస్తున్న బీఆర్ఎస్‌ను వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తిచేశారు. కొత్త, పాత అనే తేడాలేకుండా పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాయికల్ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కోల శ్రీనివాస్, జగిత్యాల పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనందరావు, ఉపాధ్యక్షులు దూమాల రాజ్‌కుమార్, ప్రజాప్రతినిధులు శ్రీనివాస్, లత రాజు, కవిత శ్రీనివాస్, దామోదర్, ఉదయ్ పాల్గొన్నారు.

# పనులు చేయనోళ్లు అవసరమా..

- నాడు అధికారంలో ఉండి ఏమైనా చేశారా..?
- ఇప్పుడు ఎన్నికలున్నాయని మళ్లీ వస్తున్నరు
- వాళ్ల మాటలు నమ్మితే మోసపోతం
- సబ్బండవర్గాల సంక్షేమమే సర్కారు లక్ష్యం
- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి


సుల్తానాబాద్‌రూరల్: కనుకులలో ఎమ్మెల్యేకు గొర్రెపిల్ల బహూకరిస్తున్న యాదవులు

సుల్తానాబాద్‌రూరల్, అక్టోబర్ 8: ‘ ఎన్నికలు వస్తున్నాయని ప్రతిపక్ష నాయకులు గ్రామాల్లో తిరుగుతున్నరు. గెలిపిస్తే అది చేస్తాం.. ఇది చేస్తాం.. అంటున్నరు. నేనొక్కటే అడుగుతున్నా? నాడు అధికారంలో ఉన్నన్ని రోజులు ఏ ఒక్క పని చేయనోళ్లు.. ఇప్పుడు మనకు అవసరమా..? ఒకసారి ఆలోచించండి’ అంటూ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజల్లో ప్రభుత్వానికి, బీఆర్ఎస్‌కు వస్తున్న ఆదరణ చూడలేక అసత్య ప్రచారం చేస్తున్నారని, వారి మాటలు నమ్మితే మోసపోతాని సూచించారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కనుకుల, మారుతీనగర్, రామునిపల్లి, మియాపూర్ గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి విస్తృతంగా పర్యటించి, ఓట్లు అభ్యర్థించారు. అంతకు ముందు గ్రామాల్లో సర్పంచులు, నాయకులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికి పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. కనుకుల, మారుతీనగర్‌లో హనుమాన్ ఆలయాలలో ఎమ్మెల్యే పూజలు చేశారు. కాగా, పలువురు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తేగా, వెంటనే పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో దాసరి మాట్లాడారు. సబ్బండవర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణలోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని చెప్పారు. నీళ్లు, విద్యుత్, పింఛన్లు, రైతు బంధు, రైతు బీమా, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, మరెన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి మన కష్టాలు తీర్చిన సీఎం కేసీఆర్‌ను ఎల్లకాలం గుర్తుంచుకోవాలన్నారు. ప్రజలపై ఏ మాత్రం ప్రేమ లేని పార్టీలు మళ్లీ మోసం చేసేందుకు గ్రామాల్లోకి వస్తున్నారని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమలో ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పురం ప్రేమ్‌చందర్‌రావు, ఏఎంసీ చైర్మన్ బుర్ర మౌనిక-శ్రీనివాస్‌గౌడ్, వైస్ ఎంపీపీ కోట స్వప్న-రాంరెడి, సర్పంచులు పోలు అంజయ్య, మల్యాల శ్రీనివాస్, కొయ్యడ స్వప్న-అరుణ్‌కుమార్, కర్క తిరుమల-శంకర్ రెడ్డి, ఎరుకొండ రమేశ్‌గౌడ్, మోరపల్లి మోహన్ రెడ్డి, కోటగిరి విజేందర్, వీరగోని సుజాత-రమేశ్‌గౌడ్, ఎంపీటీసీలు ఫకీర్‌యాదవ్, శంకర్, కన్వీనర్లు నారాయణ, భూమేశ్, ఉపసర్పంచులు శేటి రమణీ-అశోక్, రాంచంద్రరెడ్డి, తాళ్లపల్లి అగయ్య ఫౌండేషన్ చైర్మన్ తాళ్లపల్లి మనోజ్‌గౌడ్, బీసీ మండల కన్వీనగర్ కుమార్‌బాబు, గ్రామ శాఖ అధ్యక్షులు రాజేశం, శ్రీనివాస్ ఉన్నారు.

# తెలంగాణ జల ప్రదాత సీఎం కేసీఆర్

- కాళేశ్వరంతో తాగు, సాగుకు పుష్కలంగా నీళ్లు
- ఎమ్మెల్యే కోరుకంటి చందర్

ఫర్టిలైజర్‌సిటీ, అక్టోబర్ 8: గోదావరి దిశ మార్చి తెలంగాణ దశమార్చిన సీఎం కేసీఆర్ రాష్ట్రానికి జల ప్రదాత అని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కొనియాడారు. సమీకృత మత్స్య అభివృద్ధి పథకంలో భాగంగా ఆదివారం గోదావరి నదిలో చేప పిల్లలు వదిలి మాట్లాడారు. సముద్రంలో వృథాగా కలుస్తున్న నీటిని ఒడిసిపట్టి గోదావరి నది దిశమార్చిన అపర భగీరథుడు కేసీఆర్ అని ప్రశంసించారు. రాష్ట్ర రైతులకు పుష్కలంగా సాగు, ప్రజలకు తాగు నీరందించడమే కాదు మత్స్యకారులకు జీవనోపాధి కల్పించారని, ఉచితంగా చేప పిల్లలు పోస్తూ అండగా నిలుస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కు మద్దతుగా కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఇక్కడ రామగుండం మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్, కార్పొరేటర్ దాతు శ్రీనివాస్, జిల్లా జిల్లా మత్స్య అధికారి భాస్కర్, ఫీల్డ్ ఆఫీసర్ రవికుమార్, నాయకులు బంగారి రాజయ్య, సాంబమూర్తి ఉన్నారు.


గోదావరిలో చేప పిల్లలు వదులుతున్న రామగుండం ఎమ్మెల్యే చందర్

# నిర్వాసితులకు అండగా ఉంటాం

- త్వరలోనే రూ.14కోట్ల నష్టపరిహారం ఇస్తాం
- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు


ఎమ్మెల్యే రమేశ్‌బాబును సన్మానిస్తున్న సంకెపల్లి గ్రామస్తులు

వేములవాడ రూరల్, అక్టోబర్: నిర్వాసితులకు అండగా ఉన్నామని, ముంపు గ్రామాల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు స్పష్టం చేశారు. త్వరలోనే ఇండ్లకు సంబంధించి రూ.14 కోట్ల పరిహారాన్ని కూడా అందజేస్తామని చెప్పారు. సంకెపల్లి గ్రామంలో ముంపునకు గురైన 45 కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో తీసుకోవాలని, వాటికి సంబంధించిన నష్టపరిహారం నిధులు చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, ఆదివారం గ్రామస్తులు ఎమ్మెల్యే రమేశ్‌బాబు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావును కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేశ్‌బాబు మాట్లాడారు. ముంపు గ్రామాల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఉపాధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతానన్నారు. సంకెపల్లి గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించడంపై సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే, ఇందులో మంత్రి హరీశ్‌రావు కృషి ఎంతో ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే రమేశ్‌బాబును సర్పంచ్ జింకె సునీత, యువకులు ఘనంగా సన్మానించారు. అనంతరం చల్మెడ నివాసంలో ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావును సంకెపల్లి గ్రామస్తులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహారావు మాట్లాడుతూ ముంపు గ్రామాల సమస్యలు పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇక్కడ ఎంపీపీ బూర వజ్రమ్మ, జడ్పీటీసీ మ్యాకల రవి, వైస్ ఎంపీపీ ఆర్‌సీ రావు, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, అనుపురం సర్పంచ్ వెంకటరమణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్, మల్లేశం, రాము, బుచ్చయ్య, నర్సింహారెడ్డి ఉన్నారు.

# అమాత్యుడు రామన్న ఔదార్యం

- యువకుడి దవాఖాన బిల్లు రూ.4 లక్షలు మాఫీ
- కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబ సభ్యులు

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 8 : నిరుపేద యువకుడి మెరుగైన వైద్యానికి అవసరమైన దవాఖాన బిల్లు మాఫీ చేయించి మంత్రి కేటీఆర్ మరోసారి ఔదార్యాన్ని చాటుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన కొండ అఖిల్ రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందాడు. వారం రోజుల పాటు చికిత్స పొందిన అఖిల్ ఆరోగ్యం మెరుగుపడడంతో దవాఖాన సిబ్బంది ఆదివారం డిశ్చార్జి చేయాలని, రూ.4 లక్షలు బిల్లు చెల్లించాలని బాధిత కుటుంబ సభ్యులకు సూచించారు. వీరిది నిరుపేద కుటుంబ కావడంతో స్థానిక కౌన్సిలర్ అన్నారం శ్రీనివాస్ వీరి పరిస్థితిని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన అమాత్యుడు సంబంధిత అధికారులు, దవాఖాన యాజమాన్యంతో మాట్లాడి బిల్లును పూర్తిగా మాఫీ చేయించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు మంత్రి కేటీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సంజయ్ కల్వకుంట్లకే మా మద్దతు

- మెట్‌పల్లిలో ఎలక్ట్రికల్ వెల్ఫేర్ అసోసియేషన్ తీర్మానం

మెట్‌పల్లి, అక్టోబర్ 8: కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్లకు మద్దతు పెరుగుతున్నది. ఆదివారం మెట్‌పల్లిలో పట్టణ ఎలక్ట్రికల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సంజయ్‌కు జై కొట్టారు. ‘మా మద్దతు మీకే’ అంటూ ఏకగ్రీవ తీర్మానం చేసి ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెడుతున్న పథకాలు, నియోజకవర్గంలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో తమ జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. ఎమ్మెల్యే తనయుడు బీఆర్ఎస్ కోరుట్ల నియోజకవర్గ అభ్యర్థి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న నేపథ్యంలో మా సంఘ సభ్యులతో పాటు కుటుంబ సభ్యులందరం కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో సంజయ్‌ని గెలిపించుకుంటామని ముక్తకంఠంతో ప్రకటించారు. అంతకు ముందు ఎలక్ట్రికల్ వెల్ఫేర్ ఆసోసియేషన్‌కు మంజూరైన రూ.3 లక్షల ప్రొసీడింగ్ పత్రాన్ని సభ్యులకు సంజయ్ కల్వకుంట్ల అందజేశారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.


సంజయ్ కల్వకుంట్లకు తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు